అధ్వానంగా ఏఎమ్మార్పీ కాల్వ


నకిరేకల్ శివారులో కంపచెట్లతో మూసుకుపోయిన ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ


కాలం వారి కుంటకు వచ్చే డిస్ట్రిబ్యూటరీ దుస్థితి

- కమ్మేసిన కంపచెట్లు
- దెబ్బతిన్న డిస్ట్రిబ్యూటరీలు
- దిగువకు సాఫీగా వెళ్లని నీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

నకిరేకల్ : రైతుల పంటలకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం నిర్మించిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాల్వ అధ్వానంగా మారింది. కాల్వ నిండా కంపచెట్లు నిండిపోవడంతో నీరు విడుదల చేసే సమయంలో దిగువకు సాఫీగా వెళ్లడం లేదు. ఫలితంగా ఈ కాల్వ కింద ఉన్న పలు మండలాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 136 కిలోమీటర్ల పొడవు ప్రవహించే ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు నకిరేకల్ మండలం చివరిగా ఉంది.

దాదాపు 30 వేల ఎకరాలకు సాగునీరు..

పానగల్లు ఉదయ సముద్రం నుంచి నకిరేకల్ మండలంలోని నడిగూడెం వద్ద ఉన్న మూసీ రిజర్వాయర్‌లో ఏఎమ్మార్పీ కాల్వ కలుస్తుంది. ఈ కాల్వ చివరి ప్రాంతంగా ఉన్న నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి మండలాల్లో మొత్తం 30 వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. డీ–40 నుంచి చివరి డిస్ట్రిబ్యూటరీ డీ–55 వరకు మొత్తం 16 డిస్ట్రిబ్యూటరీల ద్వారా నకిరేకల్ నియోజకవర్గానికి సాగు, తాగు నీరు అందించాలనే లక్ష్యంతో ఏఎమ్మార్పీ కాల్వ నిర్మించారు. డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాల్వలు, పంట కాల్వలు 20 సంవత్సరాల క్రితం నిర్మాణం జరిగినప్పటికీ నేటికీ సగం ఆయకట్టుకు కూడా నేరుగా నీరందించని పరిస్థితి నెలకొంది. ఈ కాల్వ పరిధిలోని చెరువులు, కుంటలను నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోర్లలో సమృద్ధిగా నీరుండి ఎక్కువ గ్రామాలకు పరోక్షంగా ఉపయోగపడుతుంది.

రెండేళ్లుగా దిగువకు అందని నీరు

పానగల్ ఉదయ సముద్రం నుంచి దిగువన ఉన్న ఏఎమ్మార్పీ కాల్వకు నీటిని విడుదల చేయాలి. కాల్వలు పూడిక, కంపచెట్లతో నిండిపోవడంతో నీరు విడుదల చేసినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పానగల్ రిజర్వాయర్‌లో నీరు సరిపోను రాకపోవడంతో దిగువకు రెండేళ్లుగా నీరు వదలడం కూడా నిలిచిపోయింది. ప్రధాన కాల్వ నుంచి ఆయా చెరువులకు కుంటలకు వెళ్లే డిస్ట్రిబ్యూటరీల పరిస్థితి మరి అధ్వానంగా మారింది. కాల్వలో చెట్లు అల్లుకుపోవడంతో దిగువనకు నీరు వెళ్లడం లేదు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అయినందున పానగల్ రిజర్వాయర్ నుంచి రాబోయే రోజుల్లో నీటిని విడుదల చేయనున్నారు. ప్రభుత్వం స్పందించి ఏఎమ్మార్పీ కాల్వలో కమ్మేసిన కంపచెట్లను తొలగించాలని, అదేవిధంగా డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేపట్టి దిగువకు సాఫీగా నీరు విడుదలయ్యేలా చూడాలని ఆయా మండలాల రైతులు కోరుతున్నారు.

కంపచెట్లు తొలగించాలి



ఏఎమ్మార్పీ కాల్వలో పెరిగిన కంపచెట్లను తొలగించాలి. నీరు విడుదల చేసిన సమయాల్లో కాల్వల నిండా చెట్లు పెరగడంతో సాఫీగా నీరు దిగువకు రావడం లేదు. ప్రధాన కాల్వలతోపాటు ప్రధాన కాల్వ నుంచి నీరు వెళ్లే డిస్ట్రిబ్యూటరీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి కంపచెట్లు, పూడిక తొలగించాలి.

–గున్నాల రవీందర్‌రెడ్డి, రైతు, నకిరేకల్

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

చిట్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు చిట్యాల ఎంపీడీఓ జయలక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

మునుగోడు: ప్రభుత్వ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.నరేందర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం మునుగోడు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఇసుక ట్రాక్టర్ల యజమానులతో వారు మాట్లాడారు. నంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూజ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేవీపీఎస్ శిక్షణ తరగతులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చండూరు (గట్టుప్పల్): ఈ నెల 26, 27 తేదీల్లో నల్లగొండలో జరిగే కేవీపీఎస్ జిల్లా సామాజిక ఉద్యమ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్టు శివకుమార్ పిలుపునిచ్చారు. శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వెల్మకన్నె ఎంపీటీసీ చాపల మారయ్య, దోటి శేఖర్, మల్లేష్, యాదయ్య, నరసింహ, శ్రీను, యాదయ్య, మహేందర్, అచ్చాలు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కేతేపల్లి: నల్లగొండలోని ఎస్‌పీఎస్ భవన్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించే కుల వివక్ష పోరాట సమితి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆసంఘం నాయకులు మంగళవారం కేతేపల్లిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి వంగూరి వెంకన్న, సీహెచ్.బుర్రమారయ్య, గోలి ఎల్లయ్య, పెరిక మల్లయ్య, ధనరాజ్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి సన్మానం


బండి సంజయ్‌ని సన్మానిస్తున్న డ్యాబ్ ప్రతినిధులు

నల్లగొండ టూటౌన్ : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మంగళవారం ఢిల్లీలో డ్యాబ్ ప్రతినిధులు కలిసి ఘనంగా సత్కరించారు. అంధుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తనను ప్రభుత్వ సలహాదారుడిగా నియమించేందుకు సిఫారసు చేసేందుకు చొరవ తీసుకోవాలని మంత్రికి డ్యాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు విన్నవించారు. అనంతరం ఢిల్లీలోనే ఉన్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏసీబీ సభ్యుడు స్వామినాయక్, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములు తదితరులు ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న దండంపల్లి సత్తయ్య

నల్లగొండ టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా మున్సిపల్ కార్మికుల హాజరు పాయింట్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించనున్న రెండో పీఆర్‌సీలో కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికుల అంత్యక్రియలకు రూ.30 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పేర్ల సంజీవ, పెరిక కృష్ణ, తీగల ఎల్లమ్మ, దాసరి జానమ్మ, కిరణ్మయి, దేవరకొండ నర్సింహ, దాసరి అనూష పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


పాలకవర్గ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల: పట్టణంలోని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వరకాంతం నరేందర్‌రెడ్డి, డైరెక్టర్లుగా జిట్ట రవి, చిర్రబోయిన యాదయ్య, యాస దేవేందరమ్మ, నూదిరెడ్డి లక్ష్మారెడ్డి, జిట్ట యాదయ్య, చిర్రబోయిన రమేష్, పెద్దగాని ముత్యాలు, మాంద్ర గణేశ్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన పాలకవర్గ సభ్యులను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, ఏర్పుల పరమేష్, బొబ్బల రాంరెడ్డి, వరకాంతం శ్రీనివాస్‌రెడ్డి, అమరోజు మదన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో రాయితీ

నల్లగొండ టౌన్ : జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో గార్లపాటి కృష్ణారెడ్డి, పులిమామిడి మహేందర్‌రెడ్డి, పిట్టల రామకృష్ణ, మదనాచారి, అశోక్ ఉన్నారు.

రైతులకు అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

నకిరేకల్ : వానాకాలం పంటల సాగుపై మండలంలోని చందుపట్ల రైతు వేదిక భవనంలో క్లస్టర్ లెవల్‌లో రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై వివరించారు. రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఏడీఏ రామారావు, ఏఓ జాని, బీటీఎం విక్రమ్, హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సీజ్ చేయాలి

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఎస్‌పీఆర్ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్ గౌడ్, కర్నాటి యాదగిరి, కొంపల్లి రామన్నగౌడ్, సహదేవ్, ప్రమోద్, మహేష్, పృథ్వీ, సాయి, రామ్ చరణ్, మల్లికార్జున్, హరికృష్ణ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

బీమాతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా


బీమా చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తల కుటుంబాలకు అందించే బీమా సౌకర్యం వారి కుటుంబాలకు కొండంత భరోసా ఇస్తుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని తుంగతుర్తి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త గూడపూరి ప్రశాంత్ కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలకు బాసటగా నిలవాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించారని అన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు కొండ సైదులు, దండు వెంకటేష్, ఎ.సోమయ్య, జటంగి సైదులు, రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణించేది ఎలా !


మునుగోడు–నల్లగొండ ప్రధాన రహదారిలో రైస్ మిల్లు సమీపంలో పడిన గుంతలు

మునుగోడు: మండల కేంద్రం నుంచి నల్లగొండకు నిత్యం పదుల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు జరుపుతుంటారు. అయితే మునుగోడు–నల్లగొండ ప్రధాన రహదారిపై మునుగోడు గ్రామ శివారులోని రైస్ మిల్లు వద్ద దాదాపు 50 మీటర్ల వరకు పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా గుంతలు ఉండడంతో వర్షం కురిసిన రోజు రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఆ రోడ్డుపై వాగు నుంచి మిల్లు వరకు దాదాపు కిలోమీటరు వరకు ఇదే పరిస్థితి ఉండేది. అప్పటి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ. కోటి 20 లక్షలు మంజూరు చేయించి 800 మీటర్ల వరకు సీసీ రోడ్డు వేయించారు. దీంతో దాదాపు రెండు, మూడు ఏళ్ల పాటు ఇబ్బంది పడిన వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు వేసి ఏడాది కాకముందే సీసీ రోడ్డుకు అతి సమీపంలో గుంతలు పడడంతో వాహనదారులకు మళ్లీ తిప్పలు మొదలయ్యాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మరో 300 మీటర్ల వరకు సీసీ రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు


కేతేపల్లి–చెర్కుపల్లి దారిలో ఏర్పడిన గోతి

కేతేపల్లి: మండల కేంద్రం నుంచి వ్యవసాయ భూముల మీదుగా చెర్కుపల్లి వెళ్లే దారి మధ్యలో పైప్ కల్వర్టుపై పోసిన మట్టి కుంగి పెద్ద గోతి ఏర్పడింది. కేతేపల్లి నుంచి కాలి నడకన, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై చెర్కుపల్లి గ్రామానికి వెళ్లే ప్రజలు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులతో ఈదారి నిత్యం రద్దీగా ఉంటుంది. కాగా రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ ఆ దారిన వెళ్లే వారు గోతిలో పడి గాయాలపాలవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సమీపంలో ఉన్న వ్యవసాయ భూములు ఉన్న రైతులు ఇక్కడ గోతి ఉందని వాహనదారులకు తెలిసే విధంగా గోతిలో పెద్ద దుంగను ఉంచారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మాడుగులపల్లి : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో సోమవారం ఆయన సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్, ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిత, గనిపల్లి మోహన్, ఆరూరి నరేష్, పాల్గొన్నారు.

నగదు బహూకరణ

మాడుగులపల్లి : గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన మాడుగులపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పూర్వ విద్యార్థులు నగదు బహూకరించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5 వేలు, ద్వితీయ ర్యాంకు విద్యార్థికి రూ.3వేలు, తృతీయ ర్యాంకు సాధించిన వారికి రూ.2వేలు అందించారు. 2000–01 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో కొన్నేళ్లుగా అదే పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న విషయం తెలిసిందే.

నూతన చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్‌రావు

కట్టంగూర్ : భారత ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మూడు చట్టాలపై అధికారులకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలను తీసుకొచ్చిందని తెలిపారు. కొత్తగా వచ్చిన మూడు చట్టాలపై అధికారులు మహిళలకు, పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీఓ సన్ని అబ్రహం, సూపరింటెండెంట్ చలపతి, ఏపీఓ రాంమోహన్, ఏపీఎం సైదులు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి


సమస్యలు తెలుసుకుంటున్న ప్రభావతి

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ఆస్పత్రిలో డాక్టర్ల, సిబ్బంది కొరత ఉందన్నారు. ప్రతిరోజు 350 మంది గర్భిణులు ఓపీ సేవలకు వస్తున్నందున గైనకాలజిస్టుల సంఖ్య పెంచాలన్నారు. ఎంసీహెచ్ కిట్లు ఇవ్వడం లేదని, ప్రభుత్వం స్పందించి వెంటనే కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డైట్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రోగులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు బండ అనురాధ, జిట్ట సరోజ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన, జిల్లా కమిటీ సభ్యురాలు మునుకుంట్ల ఉమారాణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా గణపతి పూజ


హోమంలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని రామకోటి స్తూప ఆలయంలో కటహార చతుర్థి సందర్భంగా ఉదయం పంచలోహ మహాగణపతికి సామూహిక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహాగణపతికి మూలమంత్ర హోమం, మృత్యుంజయ, నవగ్రహ, లక్ష్మీగణపతి హోమం నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రేపాల భద్రాద్రి రాములు, బండారు వెంకటేశ్వర్లు, గుడిపాటి సత్యనారాయణ, కందుకూరి నాగయ్య, శివకోటి నెహ్రూ, పోల భిక్షపతి, బండారు జ్యోతి, గుడిపాటి పద్మావతి, వనమా వాణి, జూలూరి లలిత తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు దేశ సంస్కృతిని అందించాలి


మాట్లాడుతున్న మాధవీలత

రామగిరి(నల్లగొండ): దేశ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని బీజేపీ నాయకురాలు కొంపెల్లి మాధవీలత అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ బైపాస్ వద్ద శ్రీ కల్యాణ కనకదుర్గమ్మ ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాల్లో ఆమె పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మాధవీలత మాట్లాడుతూ మర్రిగూడకు చెందిన జెర్రిపోతుల సైదులుగౌడ్–పద్మ పది సంవత్సరాల నుంచి పొలంలో వెలసిన అమ్మవారిని కాపాడుకుంటు పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మూల విరాట్ అమ్మవారికి 108 కలశములతో పంచామృత అభిషేకాలు, మంత్రపుష్పం, సామూహిక కుంకుమార్చన, మహాప్రసాద నివేదనలు పర్వతం రామకృష్ణాచార్యుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జెర్రిపోతుల సైదులుగౌడ్, సభ్యులు జెర్రిపోతుల శ్రీ దుర్గా, జెర్రిపోతుల కార్తీక్ గౌడ్, బుర్రికుల అకవరం ఉదయ్‌కుమార్, అర్చకులు తిరందాసు శ్రవణ్, సురికి మారయ్య, కలగోని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా ఉపేందర్


జాల ఉపేందర్

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘంలో ఖాళీగా ఉన్న మూడు డైరెక్టర్ స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు పెరుమాండ్ల సైదమ్మ, జాల మహేశ్వరి రెండు డైరెక్టర్ స్థానాలలో విజయం సాధించగా మరో డైరెక్టర్ స్థానంలో బీఆర్‌ఎస్ మద్దతుతో బీజేపీ సానుభూతిపరుడు జాల లింగయ్య విజయం సాధించారు. మొత్తం 10 మంది డైరెక్టర్లు కలిగిన సంఘంలో నూతన అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుడు జాల ఉపేందర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మాదగోని కవితరాములింగయ్య, మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్, జంగిలి మారయ్య, పెరుమాండ్ల నరేశ్, భిక్షం, నాగరాజు, సైదులు, శంభురెడ్డి, నర్సింహ, శంభయ్య, జలందర్‌రెడ్డి, సాయి, రమేశ్, శ్రీకాంత్, ఆంజనేయులు, మల్లారెడ్డి, ఇంద్రారెడ్డి, వెంకన్న, యాదయ్య, గఫార్ పాల్గొన్నారు.

బీజేపీ నిరసన ర్యాలీ



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : ఎమర్జెన్సీ సమయంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, బీజేపీ నాయకులు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడితే జైలుకు పంపారని, ఎమర్జెన్సీ ప్రవేశపెట్టిన రోజు బ్లాక్ డే అని బీజేపీ సీనియర్ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ కో కన్వీనర్ పిల్లి రామరాజు యాదవ్ అన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా మంగళవారం బీజేపీ నాయకులు నల్లగొండలోని పార్టీ కార్యాలయం నుంచి సుభాష్ విగ్రహం వరకు నోటికి నల్ల రిబ్బన్‌లు కట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి దేశ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. కార్యక్రమంలో వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక సాంబయ్య, లింగస్వామి, ప్రసాద్, నీరజ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ధర్నా


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చిట్యాల: గ్రామాల్లో మూడేళ్లు దాటిన పిల్లలను వారి తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించకుండా ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తున్నారని చిట్యాల ఎంఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు రావడం తగ్గిపోయిందన్నారు. గ్రామాల్లోని చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దాడి అరుణ, లలిత, అలివేలు, మంగ, జానకమ్మ, పరమేశ్వరి, అండాలు, భాగ్యమ్మ, నాగమణి, పుష్పలత, దనమ్మ, హంసమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా మంచి నీటి ట్యాంక్


మునుగోడులో అపరిశుభ్రంగా ఉన్న కృష్ణా జలాల మంచినీటి ట్యాంక్

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులోని ప్రధాన కూడలిలో గల మంచి నీటి ట్యాంక్ శుభ్రతకు నోచుకోవడం లేదు. ప్రధాన చౌరస్తాకు అతి సమీపంలో చండూరు రోడ్డులో గల కృష్ణా జలాల మంచి నీటి ట్యాంక్‌లోని నీటిని పట్టణ ప్రజలతోపాటు వివిధ అవసరాల కోసం మునుగోడుకు వచ్చిన ప్రజలు తాగుతుంటారు. అయితే ఆ ట్యాంక్‌తోపాటు పరిసర ప్రాంతం అంతా అపరిశుభ్రంగా ఉంది. ట్యాంక్ వద్దనే మురుగు నిల్వ ఉండడంతోపాటు ట్యాంక్ అంతా నాచు పేరుకుపోయింది. అసలే వర్షాకాలం ఇప్పటికే కొందరు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారు. దీంతో శుభ్రం లేని నీటిని తాగితే తాము ఎక్కడ అనారోగ్యానికి గురవుతామేమోనని ప్రజలు భయపడుతున్నారు. తాగేందుకు మరొక చోట మంచినీటి ట్యాంక్ లేకపోవడంతో దుకాణాల్లో డబ్బులు పెట్టి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసి తాగుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకును పరిశుభ్రంగా కడిగించడంతో పాటు ట్యాంక్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.